క్లుప్తంగా

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



అలంకరణలో వీరబ్రహ్మేంద్ర స్వామి

గార్లదిన్నె: యర్రగుంట్లలో ఆదివారం వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి గోత్ర నామార్చనలు, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకము, పుష్పార్చన తదితర పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. వీరబ్ర హ్మేం ద్ర స్వామి కల్యాణం వైభవంగా జరిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆరాధన మహోత్సవం సందర్భంగా గ్రామంలో గాజులు, ఆట బొమ్మలు, తినుబండారాలు అంగళ్లు ఏర్పాటు చేయడంతో సందడి నెలకొంది.

భావసార క్షత్రియ సంఘం కార్యవర్గ ప్రమాణం



ప్రమాణస్వీకారం చేసిన నూతన కార్యవర్గసభ్యులు

గుంతకల్లుటౌన్: పాండురంగస్వామి కల్యాణ మండపంలో ఆదివారం పట్టణ భావసారక్షత్రియ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా పి.అనిల్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాజేష్, ఉపాధ్యక్షుడిగా శ్యామారావు, కార్యదర్శిగా జ్ఞానేశ్వర్, ఉప కార్యదర్శిగా జగన్నాథరావు, కోశాధికారిగా రవీంద్రనాథ్, డబ్బీదార్‌గా సత్యనారాయణరావు ప్రమాణస్వీకారం చేశారు. భావసారక్షత్రియ కులస్థుల సమస్యల పరిష్కారంతో పాటు సంఘం అభివృద్ధికి పాటుపడతామని అధ్యక్షుడు అనిల్ తెలిపారు. కార్యక్రమంలో కులసంఘం పెద్దలు తారకేష్, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చేనేత మగ్గం పరికరాల పంపిణీ

యాడికి: తాడిపత్రి నియోజక వర్గంలోని 73 మంది చేనేత కార్మికులకు మంజూరైన మగ్గం పరికరాలను సోమవారం పెద్దపప్పూరు మండల పరిషత్ కార్యాలయంలో పంపిణీ చేయనున్నారు. కార్యక్రమానికి అనంతపురం ఎంపీ తలారీ రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి హాజరవుతారని అధికారులు తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

గుంతకల్లుటౌన్: ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉచిత పాలిటెక్నికల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు అవసరమైన పాలీసెట్ స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బొట్టు రామాంజనేయులు, జెట్టి శ్రీనివాసులు సహకారంతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. పాలీసెట్ ప్రవేశపరీక్షలో మంచి ర్యాంకులు సాధించాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏబీవీపీ పట్టణ కార్యదర్శి శివరాజ్, సహాయ కార్యదర్శి నాగేంద్ర, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌పై అవగాహన

తాడిపత్రి టౌన్: స్థానిక అంబేద్కర్‌నగర్‌లో ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన్‌కీ బాత్ కార్యక్రమంపై ప్రజలకు బీజేపీ నాయకులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, ఆంజనేయులు, సంజీవరెడ్డి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మూడు జంటలకు నిఖా

పామిడి: స్థానిక షాదీఖానాలో ఆదివారం స్థానిక సున్నీ జామీయా మసీదు కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లిం జంటలకు సామూహిక నిఖా ఘనంగా నిర్వహించారు. మసీదు ముతువలి బీ రుక్మాన్ సమక్షంలో మూడు జంటలకు ఒక్కటయ్యాయి. ఈసందర్భంగా నూతన వధూవరులకు కావాల్సిన సామగ్రిని అందజేశారు. నిఖాకు హాజరైన వెయ్యి మందికి పెళ్లి విందు ఏర్పాటు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు మున్నా

గుంతకల్లు రూరల్: అయ్యవారుపల్లి–కదిరిపల్లి గ్రామాల మధ్య ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. నాగసముద్రం గ్రామానికి చెందిన మున్న (38) భారత్ గ్యాస్ ఏజెన్సీలో డెలివరీ బాయ్‌గా పని చేసేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసేందుకు అయ్యవారుపల్లికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా అయ్యవారుపల్లి–కదిరిపల్లి గ్రామాల మధ్యనున్న మలుపువద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య షాహీదా బేగం, ఇద్దరు కుమారులున్నారు.

గడప గడపకూ సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

గార్లదిన్నె: రాష్ట్రంలో గడప గడపకూ సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, ప్రతి గడపకూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో ఎమ్మెల్యే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో వివరించారు. కాలనీలో డ్రైనేజీల ఏర్పాటు, వాటర్ ట్యాంకు తదితర సమస్యలను కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఆమె వెంటనే వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరి కుల, మతాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి తమకు నచ్చిన వారికి, తమ పార్టీ వారికి మాత్రమే పథకాలు అందించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ/వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో గతాని కన్నా ఘన విజయాన్ని అందించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచు సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామోహ్మన్‌రెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్, ఎస్సీసెల్ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉప సర్పంచ్ షేక్షావలి, ఎంపీడీఓ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ కోచింగ్ క్యాంపు

గుంతకల్లు: స్థానిక ఎస్‌జేపీ హైస్కూల్‌లో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ మండలాధ్యక్షుడు హరినాథ్‌గౌడ్, ఆర్డీటీ క్రికెట్ కోచ్ కే.ఇనయతుల్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మే 01 నుంచి జూన్ 1వ తేదీ వరకు జరిగే శిక్షణకు ఆసక్తి గల క్రీడాకారులు 9701435534 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

తాడిపత్రి టౌన్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం నుంచి క్రికెట్ వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆర్డీటీ ఏటీయల్ రామాంజనేయులు, సీనియర్ క్రికెట్ కోచ్ సాధక్‌వలి, ఆర్డీటీ క్రికెట్ కోచ్ భార్గవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల రోజుల పాటు శిక్షణ ఇస్తామని, 18 సంవత్సరాల లోపు పిల్లలు పాల్గొనవచ్చని తెలియజేశారు.

కొలిచిన వారి కొంగు బంగారం



అమ్మవారి మూలవిరాట్



సుంకులమ్మ ఆలయం

- 3 నుంచి సుంకులమ్మ బండిశిల తిరునాల

పెద్దవడుగూరు: గుత్తిఅనంతపురం గ్రామంలో వెలసిన సుంకులమ్మ, ముత్యాలయ్య కొలిచిన వారి కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. పూర్వీకుల కథనం మేరకు...పూర్వం రామరాజుపల్లిలో జన్మించిన అమ్మవారు సుంకులమ్మ(అక్క), ముత్యాలయ్య(తమ్ముడు) చిన్నతనంలోనే అమ్మవారు(తట్టు) పోసి మరణించారు. ఆ సమయంలో అమ్మవారు తమను కోరుకున్న చోట స్థాపన చేయాలని కోరారు. వారి కోరిక మేరకు సమీపంలో స్థాపితం చేశారు. కొద్దిరోజులకు సుంకులమ్మ, ముత్యాలయ్య కాశేపల్లి, గుత్తిఅనంతపురం గ్రామాల మధ్యలో గోళీలు ఆడుతూ తరచూ గ్రామస్తులకు దర్శనం ఇచ్చేవారు. దీంతో ప్రజలు భయంతో వణికిపోయేవారు. అప్పుడు అమ్మవారు తమకు ఆలయం నిర్మించిన ప్రదేశంలో బండిశిలతో తిరునాల జరపాలని కోరారు. ఆ సమయంలో ప్రాంతంలో బ్రిటిష్ వారు దండయాత్ర సాగుతుండేది. వారు ఇక్కడ నిద్రించు సమయంలో వారికి దర్శనం ఇచ్చి తమకు ఇక్కడ ఆలయం నిర్మించాలని కోరింది. అప్పుడు 1941 మే నెల 11 తారీఖులో బ్రిటీష్‌వారు ఆలయాన్ని నిర్మించారు. రామరాజుపల్లి గ్రామస్తులు బండిశిల తేరు ప్రారంభించారు. అప్పటి నుంచి పెద్దవడుగూరు, కాశేపల్లి, విరుపాపురం, గుత్తిఅనంతపురం, మిడుతూరు, తదితర గ్రామాల ప్రజలు ఎంతో ప్రతిష్ఠాత్మకం ఏటా ఏడు జతల ఎద్దులతో శుడిబండిని కట్టి తిరునాలను జరుపుకుంటారు. ఐదు రోజులపాటు ఈ ఉత్సవాన్ని జరుపుకోవడం విశేషం. కాశేపల్లిలో ప్రతి ఇంటా సుంకులమ్మ, ముత్యాలయ్య పేర్లు పెట్టుకోవడం గమనార్హం.

ఐదు రోజుల పాటు తిరునాల

గుత్తిఅనంతపురం, కాశేపల్లి పామిడి మండలం రామరాజుపల్లి ప్రజల సమక్షంలో జరుగనున్న బండిశిల తిరునాల ఈనెల 3న ప్రారంభం కానుంది. 4న గుత్తిఅనంతపురం నుంచి కాశేపల్లి మీదుగా రామరాజుపల్లికి శుడిబండి ఎద్దులతో లాగిస్తారు. 5న రామరాజుపల్లి నుంచి కాశేపల్లి మీదుగా గుత్తిఅనంతపురంలోని అమ్మవారి ఆలయం వద్దకు శుడిబండి రానుంది. 6న సుంకులమ్మ ఆలయం వద్ద నిండు తిరునాల జరుగనుంది. ఈ సందర్భంగా ఆలయం చుట్టూ శుడిబండితో ప్రదక్షిణ లు చేయించి రామరాజుపల్లి కి బండిని తీసుకెళ్తారు. 7న అమ్మవారి ఆలయం వద్ద తలనీలాలు సమర్పించడం ప్రత్యేక పూజలు నిర్వహించడం పారువేటలతో తిరునాల ముగుస్తుందని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు 'స్పందన'

యల్లనూరు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండలస్థాయి అధికారులు హాజరుకావాలని తహసీల్దారు రమాదేవి సూచించారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఇవ్వాలన్నారు.

యల్లనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. అర్జీల రూపంలో వినతులు స్వీకరించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

బెస్తల అభ్యున్నతికి కృషి చేద్దాం



మాట్లాడుతున్న రమణ

తాడిపత్రి టౌన్ : బెస్త కులస్తులు అభ్యున్నతికి కృషి చేద్దామని బెస్త సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు రమణ పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాసపురంలోని బెస్త సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా నాగ సుబ్రమణ్యం, కార్యదర్శిగా పుల్లయ్య, కోశాధికారిగా శివశంకర్‌తోపాటు పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు రమణ తెలిపారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బాల సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన చౌడేశ్వరిమాత ఆలయంలో సోమవారం నుంచి అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపనోత్సాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు గణపతి పూజ, రక్షా కంకణ పూజ, అఖండ దీపారాధన, 11 గంటలకు విగ్రహ ఊరేగింపు, 2న ప్రాతఃకాల పూజలు, జపాలు, మంత్రాలు, విగ్రహానికి అభిషేకాలు, 3న మహిళల కలశ గ్రామోత్సవం, 4న ప్రాతఃకాల పూజలు, యంత్రములకు అభిషేకాలు, చండీహోమం, 5న అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందన్నారు.

వ్యక్తిపై కొడవలితో దాడి

బుక్కరాయసముద్రం: దయ్యాలకుంటపల్లిలో ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కొడవలితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ప్రతాప్‌రెడ్డి, ప్రసాద్ ఆదివారం పుట్లూరు మండలంలోని నల్లమ్మ దేవాలయం వద్ద ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. అక్కడ మద్యం మత్తులో ఇద్దరూ ఘర్షణ పడి ఇంటికి వచ్చారు. ప్రతాప్‌రెడ్డి ప్రసాద్ ఇంటి ముందు వెళ్తుండగా ఇంట్లో నుంచి కొడవలి తీసుకొచ్చి అతడి తలపై నరికి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన ప్రతాప్‌రెడ్డిని స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటి నుంచి ఉచిత కుట్టు శిక్షణ

గుంతకల్లుటౌన్: ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు సోమవారం నుంచి ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు త్రిస్లాబన్నాలీ, మనోప్రియలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీసరస్వతీ విద్యామందిరం పక్కనున్న బాలకల్యాణ ఆశ్రమం జరిగే శిక్షణలో పాల్గొనదలచిన వారు 9676101069 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గ్రామ స్వరాజ్యానికి జగనన్న బాటలు



ఎద్దులపల్లి సచివాలయ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

- ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి

పామిడి: వార్డు/గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యానికి బాటలు వేశారని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం రామగిరి, ఎద్దులపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద ఒక్కొక్కటి రూ.40 లక్షలతో నిర్మించిన రామగిరి, ఎద్దులపల్లి నూతన సచివాలయ భవనాలను అట్టహాసంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో ప్రజల చెంతకే పాలన అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలను నెరవేర్చారన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కులమత, పార్టీ బేధం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తూ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. 666 హామీల్లో ఏ ఒక్క హామీని నెరవేర్చని ఘనత మాజీ సీఎం చంద్రబాబుకే దక్కిందంటూ ఎద్దేవా చేశారు. ఏమాత్రం ప్రజాదరణ లేని పాదయాత్ర చేస్తున్న తనయుడు లోకేష్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. అలాగే బాబు దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ పవన్‌కళ్యాణ్ ఎన్ని జిమ్మిక్కులు చేసిన అధికారం దక్కడం కల్ల అన్నారు. జన హృదయనేత సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ మండల కన్వీనర్ కే నారాయణరెడ్డి, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎం లిఖిత, మాజీ చైర్మన్ ఎం వీరాంజనేయులు, ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్ మధుసూదన్‌రెడ్డి, ముస్లీం మైనార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బీ ఆసిఫ్, నాయకులు జోజోడే కుమార్, చుక్కలూరు రామకృష్ణారెడ్డి, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు మూలి నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచ్‌లు జీ వెంకటరమణమ్మ, వడ్డే లక్ష్మీదేవి, ఎంపీటీసీలు మజ్జిగ రాజశేఖర్, సుధాకర్ శర్మ, వీరా, వేణుగోపాల్‌రెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

పామిడి: వడదెబ్బపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పామిడి లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రభుత్వ ఆయూష్ సీనియర్ వైద్యాధికారి నల్లపాటి తిరుపతినాయుడు అన్నారు. ఆదివారం స్థానిక కన్యకా పరమేశ్వరీ ఆలయంలో పామిడి లయన్స్‌క్లబ్, ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో వడదెబ్బపై ఉచిత హోమియో వైద్యశిబిరంతోపాటు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వడదెబ్బ నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ తిరుపతినాయుడు అవగాహన కల్పించారు. అనంతరం వడదెబ్బ నివారణకు సంబంధించి దాదాపు 1000 మందికి హోమియో మందులను ఆయన ప్రజలకు ఉచితంగా అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మురళీకృష్ణ, ఉపాధ్యక్షురాలు డాక్టర్ శాంతిప్రియ, ప్రధాన కార్యదర్శి పీసే జయరామ్‌రావు, డైరెక్టర్స్ సుహాస్, జమీర్ రోషన్, షెక్షావలి, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కవి నారాయణమూర్తి, మండలాధ్యక్షుడు ఉపేంద్ర, ఉపాధ్యక్షులు నల్లయ్య, నాగార్జున, సతీష్‌కుమార్, కోశాధికారి అమర్‌నాథ్, ఆర్యవైశ్య మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం



డీఎస్పీ చైతన్య నుంచి చార్జ్ తీసుకుంటున్న నూతన డీఎస్పీ సీఎం గంగయ్య

తాడిపత్రి అర్బన్: శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఎవరినీ ఉపేక్షించబోమని తాడిపత్రి నూతన డీఎస్పీ సీఎం గంగయ్య స్పష్టం చేశారు. ఆదివారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వీఎన్‌కె చైతన్య నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా నూతన డీఎస్పీ తాడిపత్రి సబ్ డివిజన్‌లోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశాంత జీవనానికి భంగం వాటిల్లుతే చూస్తూ ఊరుకునేది లేదని, అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి వాటిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని సిబ్బందికి సూచించారు. అంతకుముందు సీఎం గంగయ్యకు వీఏన్‌కె చైతన్య, సీఐలు ఆనందరావు, చిన్నపెద్దయ్య, వేణుగోపాల్, ఎస్‌ఐలు, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయంలో డీఎస్పీ గంగయ్య కుటుంబ సమేతంగా స్వామికి ప్రతేక పూజలు నిర్వహించారు.

ముమ్మరంగా 'జగనన్నే మా భవిష్యత్తు'



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని 15వ వార్డులో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ అంజల, వార్డు ఇన్‌చార్జ్‌లు హమాలి రామాంజి, అరటి పండ్ల చంద్ర, ప్రసాద్‌ల నేతత్వంలో పార్టీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. అర్హులై ఉండి పథకాలు అందకుంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. మానమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ప్రతి ఇంటికీ అతికించారు. వైఎస్సార్ సీపీ నాయకులు సుధాకర్, శివ, మహేష్, ఆటో రామాంజి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వోకు గాయాలు

పామిడి: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్థానిక గుప్తాకాలనీకి చెందిన వీఆర్వో మల్లీశ్వరి గాయపడ్డారు. రోడ్డుపై నడిచి వెళ్తున్న వీఆర్వోను ద్విచక్రవాహనం ఢీ కొంది. గాయపడిన ఆమెను వెంటనే అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓడీ ప్రభాకర్‌నాయక్ ఆమెను పరామర్శించారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి

గుత్తి: కోట వీధికి వెళ్లే రహదారిలో ఉన్న షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం సాయిబాబా మాలధారుల ఇరుముడి కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. గురుస్వాములు తిమ్మారెడ్డి, పెద్దన్న మాలధారులకు ఇరుముడి కట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి, కోనా ప్రదీప్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు జేకే రాము, డీఆర్ రాజేంద్ర, సత్య గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిలైన విద్యార్థులకు తరగతులు

గుంతకల్లుటౌన్: ఇంటర్‌లో ఫెయిలై సప్లిమెంటరీ పరీక్షలు రాయనున్న శ్రీశంకరానంద ఎయిడెడ్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులకు సోమవారం నుంచి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ సి.బ్రహ్మానందరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు సబ్జెక్టుల వారీగా జరిగే ప్రత్యేక తరగతులకు విద్యార్థులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

గార్లదిన్నె: స్థానిక జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. అతని కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... పెద్దవడుగూరు మండలం చింతలచెరువుకు చెందిన రామచంద్రారెడ్డి (45) ఆదివారం నూతిమడుగులోని గురుకుల పాఠశాలలో చదువుతున్న తన కుమారుడు చరణ్‌తేజ్‌ను పిలుచుకుని బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. తిమ్మంపేట వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్క ఢీకొనడంతో వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన తండ్రీకుమారులను స్థానికులు 108లో సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక రామచంద్రారెడ్డి మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాగర్ తెలిపారు.

కిరాణా షాపులో చోరీ

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో శనివారం అర్ధరాత్రి కిరాణా షాపులో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన భూపాల్ అనే వ్యక్తి కిరాణా షాపు తాళాలను పగులగొట్టిన గుర్తు తెలియని వ్యక్తి షాపులో ఉన్న గ్యాస్ సిలిండర్, డీజిల్ క్యాన్లను ఎత్తుకెళ్లాడు.

వైభవంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవాలు



గుంతకల్లు: కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



తాడిపత్రిలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు: స్థానిక వాసవీ ఆలయంలో కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవం, ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం బిందెసేవ, అనుజ్ఞ పుణ్యాహవాచన పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని కోదండరామస్వామి ఆలయం నుంచి ఆర్యవైశ్య మహిళలు క్షీర కలశాలతో వాసవీ కన్యకాపరమేశ్వరి అలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం విష్ణుసహస్రనామపారయణము వాసవీ కంకణధారణ జరిగింది. ఆర్యవైశ్య సంఘం పట్టణాధ్యక్షుడు గోపా జగదీష్, కార్యదర్శి కందూరికృపాకర్, కోశాధికారి మేడం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో వాసవీ జయంతి వేడుకలు నిర్వహించారు. మొదట వేణుగోపాల స్వామి ఆలయం నుంచి 108 కలశాలతో కన్యకా పరమేశ్వరి దేవి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, కోశాధికారి ఆకుల శ్రీకాంత్, మహిళా మండలి అధ్యక్షురాలు రాచమడుగు ఉమాదేవి, కార్యదర్శి భాగ్యలక్ష్మి, కోశాధికారి ఆర్వేటి సుకన్య తదితరులు పాల్గొన్నారు.

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య మాతృమండలి ఆధ్వర్యంలో వాసవీమాతా జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి మహిళలు కలశాలతో గ్రామవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

యల్లనూరు: మండల కేంద్రంలోని అమ్మవారిశాలలో వాసవీమాత జయంత్యుత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీమాత చిత్రపటానికి పూలమాల వేసి పల్లకిలో ఊరేగించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

బుక్కరాయసముద్రం: స్థానిక తేరుబజార్‌లో కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంత్యుత్సాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం మహిళలు కలశాలతో అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు.

తాడిపత్రి టౌన్ : స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యాక పరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం వాసవీమాత జయంతి వేడుకలు కనుల పండువగా జరిగాయి. ఉదయం వైశ్య పతాక ఆవిష్కరణ, వాసవీ గీతాపారాయణము, గణపతి పూజ అనంతరం మెయిన్ బజార్‌లోని ఆర్‌వీస్వామి కల్యాణమండపం నుంచి 108 మంది ఆర్యవైశ్య మహిళలు కలశాలతో ఊరేగింపుగా తెచ్చిన నీటితో అమ్మవారికి జలాభిషేకం అనంతరం క్షీరాభిషేకం చేశారు. బంగారు చీరతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం స్థానిక మెయిన్ బజార్‌లో నుంచి గాంధీకట్ట, సీబీరోడ్డులో గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య సంఘం చైర్మన్ తలుపుల సురేంద్రనాథ్ , సంఘ ఉపాధ్యక్షుడు బచ్చు సుబ్రమణ్యం, కార్యదర్శి జయవరం అశ్వత్థరంగయ్య, సహాయ కార్యదర్శి భూమా సుబ్రమణ్యం, కోశాధికారి చిన్న మద్దులేటయ్య (రాజా), కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యాడికి: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి జయంతిని ఆర్యవైశ్యుల ఘనంగా నిర్వహించారు. ఉదయం శివలక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం నుంచి కలశాలతో ఊరేగింపుగా వాసవీ ఆలయానికి వచ్చారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గాదం శెట్టి బలరామయ్య, నాయకులు విశ్వనాథ్, ఆదిత్య పవన్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు: జాతీయ ఉపాధి హామీ కింద చిన్న, సన్నకారు రైతులు పండ్లతోటల పెంపకానికి మే 5వ తేదీ వరకు గడవు ఉందని ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కొండన్న ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, సన్నకారు రైతుల సర్టిఫికెట్, వన్‌బీ, అడంగల్, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, జాబుకార్డు, భూసార పరీక్ష, ఉద్యాన అధికారితో పంట ధ్రువీకరణ పత్రంతో జత చేసి ఎంపీడీఓ కార్యాలయం లేదా సచివాలయాల్లో ఇవ్వాలన్నారు.